‘హైలెవల్’ నిర్మాణమెప్పుడో?


బండపల్లి - బావుసాయిపేట మధ్య లోలెవల్ వంతెనపై వరదనీరు ప్రవహించడంతో పలువురిని ట్రాక్టర్‌పై దాటిస్తున్న యువకులు (ఫైల్)


రామన్నపేట లోలెవల్ వంతెనపై నుంచి ప్రజలను దాటిస్తున్న పోలీసులు (ఫైల్)

- ఐదేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం
- ఏటా లోలెవల్ వంతెనలపై వరద ఉధృతికి రాకపోకలకు అంతరాయం
- ఇబ్బంది పడుతున్న ఆయాగ్రామాల ప్రజలు
- కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు

చందుర్తి : వానాకాలంలో వర్షం కురిస్తే చాలు మండలంలోని సగానికి పైగా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. హైలెవల్ వంతెనల నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఏటా వర్షాకాలంలో ప్రజలు అవస్థలు పడుతున్నారు. భారీ వర్షాలతో లోలెవల్ పక్కనే ఉన్న రోడ్డు కోతకు గురై రాకపోకలు నిలిచిపోతున్నాయి. తాత్కాలిక మరమ్మతులతో అధికారులు ఏటా లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. హైలెవల్ వంతెనలు నిర్మించేందుకు ప్రభుత్వం నిధుల మంజూరులో నిర్లక్ష్యం వహిస్తుంది.

అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి

భారీ వర్షం పడితే మండలంలోని ఓ గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు సంబంధాలు తెగిపోతున్నాయి. చందుర్తి – కోనరావుపేట మండలాల సరిహద్దు గ్రామాలైన బండపల్లి–బావుసాయిపేట మధ్య, జలపతి తండా శివారులోని లోలెవల్ వంతెనలపై వరదనీరు ఉధృతిగా ప్రవహించడంతో చిన్నపాటి వర్షానికే రాకపోకలు నిలిచిపోతున్నాయి. జోగాపూర్–మర్రిగడ్డ మధ్య, చందుర్తి –రామన్నపేట ఆర్అండ్ బీరోడ్డుపై నిర్మించిన లోలెవల్ కల్వర్టు, చందుర్తి –మల్యాల మధ్య లోలెవల్ కల్వర్టులు వర్షాకాలంలో ప్రజల పాలిట శాపంగా మారాయి. వీటి స్థానంలో హైలెవల్ వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరినా గత ప్రభుత్వం ప్రతిపాదనలతో కాలం వెల్లదీసింది.

మత్తడి దూకితే ప్రయాణం వాయిదే..

మండలంలోని బండపల్లి ఊర చెరువును ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా మినీ రిజర్వాయర్‌గా నిర్మించారు. ఈ రిజర్వాయర్ మూడేళ్లుగా నిండు కుండలా మారింది. చిన్నపాటి వర్షానికే ఈమినీ రిజర్వాయర్ మత్తడి దూకితే బండపల్లి– బావుసాయిపేట మధ్య ఆర్అండ్‌బీ రోడ్డుపై నిర్మించిన లోలెవల్ వంతెనపై నుంచి నీరు పారితే రాకపోకలు స్తంభిస్తున్నాయి. 40 ఏళ్ల క్రితం లోలెవల్ వంతెనను రూ.70వేలతో నిర్మించారు. నిర్మాణ సమయంలో రోడ్డుకు మీటరు ఎత్తులో కడితే ఇబ్బందులు తప్పేవి. రామన్నపేట శివారులో లొడి చెరువు మత్తడి దూకితే చందుర్తి –రామన్నపేట రోడ్డుపై ఏర్పాటు చేసిన లోలెవల్ వంతెనపై అలుగు పారుతోంది. దీంతో రామన్నపేట, తిమ్మాపూర్, ఆశిరెడ్డిపల్లి, నర్సింగాపూర్ అనంతపల్లి గ్రామాల ప్రజలకు రాకపోకలు బంద్ అవుతున్నాయి. జలపతి తండా శివారులోని మాటు ఒర్రె వరద నీటితో రెండు మీటర్ల నీటి ప్రవాహం వస్తుంది. జోగాపూర్–మర్రిగడ్డ మధ్య ఆర్అండ్ బీ రోడ్డులో లోలెవల్ వంతెనతో మల్యాల రిజర్వాయర్ మత్తడి నీటి ప్రవాహంతో రాకపోకలు నిలుస్తున్నాయి.

ముందుచూపు లేక తిప్పలు

మండలంలోని కొన్ని కల్వర్టు పైపుల్లో చెత్తాచెదారం, చేరగా రోడ్డుపై నుంచి వరదనీరు వెళ్తుంది. ఆర్అండ్‌బీ అధికారుల ముందు చూపులేకే కొన్నిప్రాంతాల్లో ఈ పరిస్థితి దాపురిస్తోందని ఆయాగ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏటా ప్రజలు, ప్రయాణికులు ఇక్కట్లు పడుతుండగా గత ప్రభుత్వ వైఖరితో ఆధునీకరణ కాగితాలకే పరిమితం కాగా ప్రజలు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



వర్షం పడిన ప్రతిసారి నాలుగైదు రోజుల వరకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. యాభై ఏళ్ల క్రితం నిర్మించిన లోలెవల్ కల్వర్టు కాగా వంతెనపై మత్తడి నీరు పోతుంది. చిన్నపాటి వర్షానికి బండపల్లి ఊర చెరువు మత్తడి దూకడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం.

– అంబాల శ్రీకాంత్, బండపల్లి

నిధులు కేటాయించాలి



చిన్నపాటి వర్షానికే గ్రామానికి రాకపోకలు నిలుస్తున్నాయి. చందుర్తి – మల్యాల మధ్య లోలెవల్ వంతెనపై వెంగళి చెరువు మత్తడి దూకితే నీరు పై నుంచి ప్రవహిస్తుంది. వంతెన ఎత్తు పెంచి ప్రజల ప్రయాణ కష్టాలు తీర్చాలి.

– మెంగని రాజేందర్, రామన్నపేట

నివేదిక పంపాం

వర్షాకాలంలో ఇబ్బందులు ఎదురయ్యే వంతెనలను పరిశీలించాం.హైలెవల్ వంతెనల నిర్మాణానికి కావాల్సిన నిధుల కోసం ఎస్టిమెంట్‌లు తయారు చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందించాం. నిధులు మంజూరైతే వంతెనల నిర్మాణాలు చేపడుతాం.

– శాంతయ్య, ఆర్అండ్‌బీ డీఈ, వేములవాడ

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి


సిరిసిల్ల టౌన్ : అవగాహన కల్పిస్తున్న కళాకారులు

సిరిసిల్లటౌన్: తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం రోడ్డు భద్రత నియమాలపై మంగళవారం కళాజాత నిర్వహించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో బుధవారం పట్టణంలోని ఆరో వార్డులో అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యంతాగి, అతి వేగంగా వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతాయన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారథి జిల్లా టీం లీడర్ ఎడమల శ్రీధర్ రెడ్డి, కళాకారులు శ్రీరాముల రామచంద్రం, గడ్డం శ్రీనివాస్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత సామాజిక బాధ్యత

ఎల్లారెడ్డిపేట: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్సై రమాకాంత్ కోరారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫ్లెక్సీలను ఆవిష్కరించి మాట్లాడారు. రోడ్డ భద్రత నియమాలు పాటించి సురక్షితంగా గమ్యం చేరాలన్నారు. ఎక్కువ రోడ్డు ప్రమాదాల వల్లే ప్రాణాలు కోల్పోతున్నారని, వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బండారి బాల్‌రెడ్డి, కంచర్ల పర్శరాములు, దుంపెన రమేశ్, శేఖర్, కట్టెల బాబు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు వరం ‘కల్యాణలక్ష్మి’


చెక్కులు పంపిణీ చేస్తున్న సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ఏఎంసీ చైర్‌పర్సన్ స్వరూప

తంగళ్లపల్లి: మండెపల్లిలోని రాజా ప్రపుల్లా రెడ్డి ఫంక్షన్ హాల్‌లో మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. 61మందికి తహసీల్దార్ జయంత్ కుమార్ ఆధ్వర్యంలో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, సిరిసిల్ల ఏఎంసీ చైర్‌పర్సన్ వెలుముల స్వరూప తిరుపతి రెడ్డి చేతులమీదుగా చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరమన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, నాయకులు పెద్దూరి తిరుపతి, పొన్నం లక్ష్మణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీ కోర్సుపై సమావేశం


సమావేశంలో పాల్గొన్న ప్రొఫెసర్లు

వేములవాడరూరల్: వేములవాడ పట్టణంలోని శాత్రాజుపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఫ్యాషన్ డిజైనింగ్ అండ్ టెక్నాలజీ కోర్సుకు సంబంధించిన మూడు, నాలుగో సంవత్సర విద్యా ప్రణాళిక రూపొందించేందుకు బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక, సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. సమావేశంలో ప్రొఫెసర్లు అవినాష్, అన్నాజీ శర్మ, రంగ ప్రసాద్, అలివేలు, ప్రిన్సిపల్ లావణ్య, వైస్ ప్రిన్సిపాల్ సుమలత, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

సిరిసిల్లటౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీజేపీ నేతలు కోరారు. ఓబీసీ మోర్చా సిరిసిల్ల పట్టణ ఓబీసీ అధ్యక్షుడు అంకారపు రాజు మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల హామీల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ. 40 వేలకోట్లు రూపాయలు వచ్చే బడ్జెట్లో ప్రకటించాలని కోరారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలుపర్చకుంటే బీసీలకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సిరిసిల్ల తహసీల్దార్ ఉమారాణికి వినతిపత్రం అందించారు. ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెల్లి వేణుగోపాల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దాసరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

● ఫ్లెక్సీ చించివేతపై ఎమ్మార్పీఎస్ ఆగ్రహం

గంభీరావుపేట మండలకేంద్రంలో నూతన సంవత్సరం, సంక్రాంతి, ఉగాది పండుగలను పురస్కరించుకొని ఎమ్మార్పీఎస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. దీనిపై నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం రాత్రి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఫ్లెక్సీని చించిన వ్యక్తులను గుర్తించి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు నిరసనగా బుధవారం గంభీరావుపేట మండలకేంద్రంలో బంద్ కార్యక్రమం నిర్వహించతలపెట్టినట్లు నాయకులు పేర్కొన్నారు. దుకాణాల యజమానులు, ప్రజలు బంద్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఫ్లెక్సీ చించివేతపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

● లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పుస్తకాలు అందజేత

వేములవాడ: జ్ఞానాన్ని పెంచే పుస్తకాలు అందించి సమాజంలో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని డాక్టర్ నాగరమేశ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కట్కం శ్రీనివాస్, ప్రముఖ వ్యాపారి నగుబోతు రవీందర్ అన్నారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయానికి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పుస్తకాలను లైబ్రేరియన్ అనితకు అందజేశారు. రిటైర్డ్ ఉద్యోగులు, పాఠకులు పాల్గొన్నారు.

● విద్యార్థులకు అభినందన

వేములవాడఅర్బన్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయిలో రెండు రోజులుగా జరిగిన క్రీడా పోటీల్లో పట్టణంలోని శిశుమందిర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ చిలుకగట్టు తెలిపారు. 11 ఏళ్లలోపు కేటగిరీలో హై జంప్‌లో ఆదిత్య, పల్లవి, 14 ఏళ్లలోపు కేటగిరీలో వర్షిత్, కబడ్డీలో నంది కిషోర్, విజేతలుగా నిలిచారు. వీరు రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. వీరిని పాఠశాల యాజమాన్యం అభినందించారు.

వినోద్‌కు బెస్ట్ కరాటే మాస్టర్ అవార్డు


అవార్డు అందుకుంటున్న వినోద్


కోనరావుపేట: మండలంలోని ఎగ్లాస్‌పూర్‌కు చెందిన కరాటే మాస్టర్ అక్కెనపల్లి వినోద్ రాష్ట్ర బెస్ట్ కరాటే మాస్టర్ నేషనల్ అవార్డు అందుకున్నారు. ఈ నెల 5న బహుజన సాహిత్య అకాడమీ 8వ తెలంగాణ స్టేట్ కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లాల రాధాకృష్ణ చేతుల మీదుగా వినోద్‌కు అవార్డు అందజేశారు. 31 జిల్లాల నుంచి 300మంది డెలిగేట్స్ ఈ కాన్ఫరెన్స్‌కు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు నల్లాల రాధాకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎన్ గౌతమ్, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేశ్, పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళాలు ఇస్తున్న భక్తులు

ఇల్లంతకుంట: మండలకేంద్రంలో హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి జవారిపేట గ్రామానికి చెందిన 16 మంది ఒక్కొక్కరు 18వేల చొప్పున మంగళవారం అయ్యప్ప స్వాములకు అందజేశారు. కార్యక్రమంలో గురుస్వాములు ఎర్రోజు గోపాలచారి, రవీందర్ రెడ్డి, ఎర్రోజు సత్యం, కట్ట ఎల్లారెడ్డి, యాదగిరి గౌడ్, తదితరులు పాల్గొన్నారు

కల్వర్టులు తనిఖీ


కట్టలింగంపేట శివారులో కల్వర్టు తనిఖీ చేస్తున్న బాంబు స్క్వాడ్ సిబ్బంది

చందుర్తి : మూడపల్లి నుంచి లింగంపల్లి వరకు ఉన్న కల్వర్టులను భద్రతచర్యల్లో భాగంగా మంగళవారం బాంబు స్క్వాడ్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. మండల పరిధిలోని ప్రతి కల్వర్టును తనిఖీ చేశారు. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎందుకు తనిఖీ చేస్తున్నారో తెలియక ఆందోళన చెందారు. భద్రత చర్యల్లో భాగంగా తనిఖీలు చేస్తున్నారన్న విషయం తెలియడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తంగళ్లపల్లి: గురుకుల విద్యాసంస్థల్లో 5, 6,7, 8, 9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీతోపాటు సైనిక్ స్కూల్‌లో 6వ తరగతి, సీవోఈలో 9వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకులం ప్రిన్సిపాల్ దర్శనాల పద్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు బోనఫైడ్, కులం, ఆదాయం, నివాసం, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో మీసేవలో రుసుం చెల్లించి ఫిబ్రవరి 1 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని అర్హులైన క్రిస్టియన్ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేయనున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. ఈ నెల 20 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. క్రిస్టియన్ మైనార్టీకి చెందిన నిరుద్యోగులు, నిరుపేదలు, వితంతువులు, అనాథలు, ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. తెల్ల రేషన్ కార్డు, రూ.2లక్షల లోపు వార్షికాదాయం ఉండి, 21 నుంచి 35 ఏళ్ల లోపు వయసును నిర్ధారించే ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్‌తో పాటు టైలరింగ్‌లో గుర్తింపు పొందిన సంస్థ నుంచి శిక్షణ పొందినవారు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి గల వారు వెబ్‌సైట్ ద్వారా తమ వివరాలు పొందుపరచాలని, పూర్తి వివరాలకు 99499 10328 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కోర్టుకు కాంగ్రెస్ నేతలు



సిరిసిల్లటౌన్: టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి కటుకం మృత్యుంజయంతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు మంగళవారం సిరిసిల్ల కోర్టుకు హాజరయ్యారు. 2015లో ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ బిల్స్ కోసం ధర్నా చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులపై అప్పటి ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టిందన్నారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం సిరిసిల్ల కోర్టుకు హాజరైనట్లు తెలిపారు. ఆయనతో పాటు టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, గంభీరావుపేట మండల అధ్యక్షుడు హమీద్, బీసీ నాయకులు పర్శ హనుమాండ్లు, తిరుపతి రెడ్డి, దీటి నరసింహులు, మహేశ్ తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గంభీరావుపేట: ఈనెల 21న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌కు మండలంలోని దమ్మన్నపేట మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విష్ణుప్రియ ఎంపికైంది. జిల్లాస్థాయి పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్ శ్రీలత, ఉపాధ్యాయులు సుమలత, బాబుజాన్, అంజుమ్, చంద్రశేఖర్, రేణుక, అబ్దుల్ రవూఫ్, సుహాసిని, నరేశ్, వెంకటేశ్, ఆనంద్, లక్ష్మీ, ప్రవీణ్, స్పందనలు అభినందించారు.

బీజేవైఎం నాయకుల నిరసన



సిరిసిల్లటౌన్: బీజేపీ కార్యాలయంపై దాడికి దిగిన కాంగ్రెస్ గూండాలను వెంటనే అరెస్టు చేయాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ తీరుపై నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాకుంటే తప్పుకోవాలని, ప్రశ్నించిన ప్రతిపక్షాలపై దాడికి పాల్పడటం అప్రజాస్వామికమన్నారు. పోలీసులు దాడికి పాల్పడ్డవారిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. ఇక్కడ కౌన్సిలర్ గూడూరి భాస్కర్, నాయకులు అనీల్‌కుమార్, రాజాసింగ్, మ్యాన రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.15వేలు ఇవ్వాలి


నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

వేములవాడ: అన్నదాతలకు రైతు భరోసా ఎప్పుడిస్తారో స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని తెలంగాణచౌక్‌లో అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. ఎకరాకు రైతు భరోసా రూ.15వేలు ఇవ్వాలన్నారు. నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, గోలి మహేశ్, నరాల శేఖర్, రూరల్ మండల అధ్యక్షుడు గోస్కుల రవి, నాయకులు రామతీర్థపు రాజు, గడ్డం హన్మండ్లు, బాల్‌రెడ్డి, అంజనికుమార్, కట్కం మల్లేశం, వెంగళ శ్రీకాంత్‌గౌడ్, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, అంజద్ పాషా, పసుల అంజి, పిట్టల వెంకటేశ్, యామ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

ముస్తాబాద్: విద్యార్థులు ఒత్తిడితో కాకుండా ఇష్టంగా చదివినప్పుడే మంచి ఫలితాలు సాధించవచ్చని సైకియాట్రిస్ట్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్సీ బాలుర గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలన్నారు. డాక్టర్ గీతాంజలి, ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు తరగతి గదులు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. మరమ్మతు చేయాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదు. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితిలో విద్యార్థులు భయంభయంగా చదువును కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి మరమ్మతు చేయాలని పలువురు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : కృష్ణహరి, ఎంఈవో, ఎల్లారెడ్డిపేట: సెల్ నంబర్: 9441557432

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశం ఇవ్వండి


బార్ అసోసియేషన్‌లో అడ్వకేట్లతో మాజీ మేయర్ రవీందర్‌సింగ్

వేములవాడ: కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు అవకాశం కల్పించాలని మాజీ మేయర్ రవీందర్‌సింగ్ విజ్ఞప్తి చేశారు. వేములవాడ బార్ అసోసియేషన్ హాల్లో మంగళవారం న్యాయవాదులను కలిసి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టభద్రుల హక్కుల కోసం మండలిలో పోరాడుతానని, న్యాయవాదినైన తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, నేరెళ్ల తిరుమల గౌడ్, పొత్తూరు అనిల్‌కుమార్, విద్యాసాగర్‌రావు, కొడిమ్యాల పురుషోత్తం, పెంట రాజ్‌కుమార్, కందుల క్రాంతికుమార్, శ్రీనివాస్, గడ్డం సత్యనారాయణరెడ్డి, జనార్దన్, గంగరాజు, మహేందర్, సుదర్శన్, బొజ్జ నరేశ్, శ్రీధర్ తదితరులున్నారు.

‘బీఆర్ఎస్ హయాంలో అసైన్డ్ భూములు అన్యాక్రాంతం’


ముస్తాబాద్ : మాట్లాడుతున్న చక్రధర్‌రెడ్డి


ఎల్లారెడ్డిపేట: మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ముస్తాబాద్: కేటీఆర్ అనుచరులు కొందరు సిరిసిల్ల నియోజకవర్గంలో వెయ్యి ఎకరాలు కబ్జాచేసి అసైన్డ్ భూములను అన్యాక్రాంతం చేశారని కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ ఎన్నికల కో కన్వీనర్ కనమేని చక్రధర్ రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే కొందరు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేస్తే కక్ష సాధింపు అంటూ చెబుతున్న కేటీఆర్ మరి తీసుకున్న అసైన్డ్ భూములను ప్రభుత్వానికి సరెండర్ చేస్తున్న వారి విషయాన్ని ఎందుకు మరిచిపోయారని ప్రశ్నించారు. సిరిసిల్లలో బీఆర్ఎస్ భవనం కూడా కబ్జా చేసి నిర్మించారన్నారు. ఫార్ములా కార్ రేసులో చట్టం తనపని తాను చేసుకు పోతుందన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ రూ.లక్ష రుణమాఫీ చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎనిమిది నెలల్లోనే రూ.2లక్షల రుణమాఫీ చేసిందన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ గుండం నర్సయ్య, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కిషన్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ అంజన్‌రావు, కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్ జిల్లా అధ్యక్షుడు ధర్మేందర్, రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వేణు, షాదుల్‌పాష, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: బీఆర్ఎస్ హయాంలోనే జిల్లాలో అవినీతి, భూకబ్జాల పాలన సాగిందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కనిమేని చక్రధర్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాచర్ల గొల్లపల్లిలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో భూకబ్జాలపై పెట్టిన దృష్టి అభివృద్ధిపై చూపలేదన్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులతో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోతుందన్నారు. రానున్న రోజుల్లో సంక్షేమ పథకాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు మర్రి వెంకట్‌రెడ్డి, ముచ్చ రాజిరెడ్డి, ముద్రకోల్ల ప్రేమ్‌సాయి, వేముల తేజ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు ఎంపిక


గైడ్ టీచర్‌తో శివలలిత

గంభీరావుపేట: మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరులో రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీల్లో మండలంలోని కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు వెంకటేశ్, శివలలిత పాల్గొన్నారు. ఇటీవల జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో నిర్వహించిన విజ్ఞన ప్రదర్శనలో వీరు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వెంకటేశ్ రూపొందించిన నాన్ ఎలక్ట్రిక్ వాటర్ పంపు, శివలలిత రూపొందించిన సింపుల్ వాటర్ ప్యూరిఫైర్ ప్రదర్శనలు రాష్ట్రస్థాయిలో ప్రదర్శిస్తున్నారు. వీరికి సుధాకర్ గైడ్ టీచర్‌గా వ్యవహరిస్తున్నారు.

సిరిసిల్లటౌన్: రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్, వైజ్ఞానిక ప్రదర్శనకు సిరిసిల్ల ప్రభుత్వ విద్యార్థి ఎంపికయ్యారు. ఈనెల 9వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జడ్చర్లలో పోటీలు జరుగుతున్నాయి. సిరిసిల్ల కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాల ఆరో తరగతి విద్యార్థి బి. శ్రీమాన్ పోటీల్లో పాల్గొన్నారు. గైడ్ టీచర్ పాకాల శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో రూపొందించిన డ్రైవర్ స్లీప్ అలర్ట్ సిస్టం జూనియర్ విభాగంలో సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు.


హరిహరణ్

రుద్రంగి: రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు మండలకేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థి వై హరిహరణ్ ఎంపికయ్యారు. హరిహరణ్, గైడ్ టీచర్ కిషన్‌కుమార్‌ను ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు, కరస్పాండెంట్ నరేశ్, డైరెక్టర్లు అభినందించారు.

ఆర్థికసాయం అందజేత



బోయినపల్లి: మండలంలోని వరదవెల్లికి చెందిన కన్నం కృష్ణస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కొదురుపాక హైస్కూల్ 1995–96 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.21 వేలు ఆర్థికసాయంగా అందించారు. ఏ.మోహన్‌బాబు, కనుకయ్య, ఆర్.శ్రీనివాస్, బాలకిషన్, ప్రభాకర్, అమర్‌నాథ్, మల్లేశం, అజయ్, తిరుపతి, సంపత్, రవి, ఆడెపు రాజు, బుర్ర రవి, టీచర్ బాలకిషన్ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట: పొత్తూరు సమీపంలోని బిక్క వాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా సోనవేని నాగరాజు (35)ను అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. అనంతరం ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్ తరలించి నాగరాజును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.